వేసవి రాకముందే నీటి ఎద్దడి నెలకొంది. సంగారెడ్డి మండలపరిధిలోని హనుమాన్‌నగర్‌లో నీటి కోసం ప్రజలు తంటాలు పడుతున్నారు. తాగునీరు రాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని డ్రమ్ముల్లో పట్టుకుంటున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మున్ముందు నీటి తిప్పలు ఎలా ఉంటాయోనని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి, ఫిబ్రవరి 18

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో భోగ్ భండార్ నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహ, (ఇన్‌సెట్‌లో) గిరిజన వేషధారణలో విద్యార్థులు

జేఎన్టీయూలో ఘనంగా సేవాలాల్ జయంతి

చౌటకూర్, ఫిబ్రవరి 18:మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జాట్రోత్ హరికిషన్ నాయక్ హాజరయ్యారు. ముందుగా కళాశాలలో సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, భోగ్ భండార్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 17వ శతాబ్దంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన సేవాలాల్ దేశమంతటా తిరిగి బంజారా సమాజాన్ని ఏకంచేసిన మహనీయుడని కొనియాడారు. బాల బ్రహ్మచారిగా నిష్టతో అహింసావాదం వైపు లంబాడాలను నడిపించిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. బంజారాలు ఐకమత్యంతో మెలగాలనంటూ వారికి దిశానిర్దేశనం చేసిన దార్శనికుడన్నారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు లంబాడ వేషధరణతో నృత్యప్రదర్శన చేస్తూ అలరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, వివిధ విభాగాధిపతులు ఆచార్య రజనేశ్, విజయ్‌కుమార్, సునీత, జోషీశ్రీపాద, బోధన, బోధనేతర సిబ్బంది, గౌరాసిక్ వాడి రాష్ట్ర అధ్యక్షుడు జగన్ నాయక్, సభ్యులు రాజునాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే చర్యలు

మాట్లాడుతున్న డీఎస్పీ సత్తయ్య గౌడ్

మునిపల్లి, ఫిబ్రవరి 18: సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బుధేరా పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ మండలపరిధిలోని అంతారంలో ఈనెల 11న జరిగిన గొడవలో తండ్రిని కాపాడేందుకు యత్నించి ఇస్మాయిల్ కూతురు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే పనిగట్టుకొని కొంతమంది సోషల్ మీడియలో తప్పుడు పోస్టులు పెడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, తప్పుడు పోస్టులు పెడితే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. సమాజానికి అవసరమైన పోస్టులు పెటట్టాలి గానీ పనిగట్టుకొని తప్పుడు పోస్టులు పెడితే సహించేది లేదన్నారు. కొండాపూర్ సీఐ వెంకటేశం, మునిపల్లి ఎస్సై రాజేశ్‌నాయక్ ఉన్నారు.

న్యాల్‌కల్ మండలం డప్పూర్ శివారులో జరిగిన కుస్తీ పోటీల్లో పాల్గొన్న మల్లయోధులు

అలరించిన అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు

జహీరాబాద్, ఫిబ్రవరి 18: సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్ గ్రామ శివారులోని షరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ ఖిబ్లా దర్గా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు అలరించాయి. దర్గా సమీపంలో నిర్వహించిన కుస్తీ పోటీలకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన మల్లయోధులు భారీగా తరలివచ్చారు. ఉర్సు నిర్వహకులు, హద్నూర్ పోలీసులు ఎలాంటి గొడలు జరగకుండా కుస్తీ పోటీలకు ఏర్పాట్లు చేశారు. డప్పు చప్పుడూ, ప్రజల ఈలాలు, కేరింతల మధ్య మల్లయోధులు కుస్తీలను నువ్వానేనా అన్న రీతిలో పోటీపడ్డారు. ఫైనల్లో కర్ణాటకలోని గుల్బర్గ ప్రాంతానికి చెందిన సిద్ధు బెల్కేరి విజేతగా నిలిచారు. గ్రామ మాజీ సర్పంచ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు జమీరొద్దీన్, కమిటీ సభ్యులు కలిసి విజేతకు 11 తులాల వెండి కడియాన్ని బహుమతిని అందజేశారు. ఈ ఉత్సవాలకు కులమతాలకు అతీతంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్గాలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉర్సు నిర్వహక కమిటీ అధ్యక్షుడు జమీరొద్దీన్, ఉపాధ్యక్షుడు హైమద్, గ్రామ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కంది, ఫిబ్రవరి 18: నిధులు దుర్వినియోగం చేసినందుకు కంది మండలం తునికిలతండా గ్రామ పంచాయతీ కార్యదర్శి రేఖను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సదాశివపేట మండలం వెల్టూరు పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన సమయంలో రూ.4 లక్షలు దుర్వినియోగమైనట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విధుల నిర్లక్ష్యం, పుస్తకాల నిర్వహణలో లోపం ఉన్నట్లు గుర్తించారు.

నక్కవాగులో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాల పారబోత

పటాన్‌చెరు, ఫిబ్రవరి 18: నక్కవాగులోకి సెప్టిక్ వ్యర్థాలను వదులుతున్న ట్యాంకర్‌ను పీసీబీ శాఖ సిబ్బంది పట్టుకుని ఆ వాహనం నుంచి శాంపిల్స్ సేకరించారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి పరిధిలోని జాతీయ రహదారిపై నక్కవాగు బ్రిడ్జి పైనుంచి సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను పైపు ద్వారా వదులుతున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన పీసీబీ శాఖ ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్ ట్యాంకర్ నుంచి నీటిని వదలకుండా అడ్డుకున్నారు. ఈ వ్యర్థాలు ఎక్కడి నుంచి తెచ్చారని డ్రైవర్, క్లీనర్‌ను ప్రశ్నించారు. సంబంధిత వాహన డ్రైవర్ ముత్తంగిలోని ఉడిపి హోటల్ వ్యర్థాలు అని తెలిపాడు. వాహనం నుంచి శాంపిల్స్ సేకరించారు. పీసీబీ ఈఈ గీతా సంగారెడ్డి నుంచి వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఉడిపి హోటల్ నిర్వాహకులను జల వనరుల్లో వ్యర్థాలు పారవేయరాదని హెచ్చరించారు. శాంపిల్స్ ఫలితాలు వచ్చాక ఆ నీటిలో హానికర అవశేషాలుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలుష్యంనుంచి జలవనరులను కాపాడేందుకు పీసీబీ శాఖ ప్రత్యేక బృందాలు నిరంతరం తిరుగుతున్నాయని పీసీబీ ఈఈ చెప్పారు.

వాగులో వ్యర్థాలు పారబోస్తున్న ట్యాంకర్

సరిహద్దు దాటుతున్న రేషన్ బియ్యం

- 65వ జాతీయ రహదారి గుండా కర్ణాటక, మహారాష్ట్రలకు అక్రమంగా తరలింపు
- అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో జోరుగా సాగుతున్న దందా
- వారంలో 656 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

జహీరాబాద్, ఫిబ్రవరి 18:పేదలకు ప్రతినెలా ఒక వ్యక్తికి ఆరు కిలోల చొప్పున ప్రభుత్వం రేషన్ బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్నప్పటికీ రేషన్‌కార్డు పొందిన కొందరు కిలో రూ.15 నుంచి 20 చొప్పున విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు మండలాల్లోని వివిధ గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యం సేకరించేందుకు ప్రత్యేకంగా కూలీలను ఏర్పాటు చేసుకుని దందాను కొనసాగిస్తున్నారు. ఈ బియ్యాన్ని కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇక్కడే కాకుండా రాష్ట్రంలోని పలుచోట్ల రేషన్ బియ్యం దందా దర్జాగా సాగుతున్నది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సేకరిస్తున్న రేషన్ బియ్యాన్ని వాహనాల్లో తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ప్రాంతం గుండా కర్ణాటక, మహారాష్ట్ర తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టుకుంటున్నప్పటికీ అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. అక్కడ వారికి అనుకూలంగా ఉన్న మిల్లులో రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సన్నరకం బియ్యంగా మార్చి వాటినే వివిధ రకాల బ్రాండ్ల పేర్లతో సుమారు రూ.4,500 నుంచి 6,000 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. జహీరాబాద్ నియోజకవర్గంలోని 65వ జాతీయ రహదారైన హైదరాబాద్–ముంబయి రోడ్డు మార్గం నుంచి భారీఎత్తున రేషన్ బియ్యం అక్రమ రవా ణా సాగుతున్నది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా వాహనాల్లో కర్ణాటక, మహారాష్ట్ర చేరుకోవడానికి సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది మామూళ్లు తీసుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీగా వాహనాల్లో రేషన్ బియం తరలివెళ్తున్నా.. సంబంధిత శాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. తెలంగాణ–కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాడ్గి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వారం రోజుల్లోనే 656 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని చిరాగ్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. సంబంధిత జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేస్తున్నారు. అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలించకుండా ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖాధికారులు రేషన్‌బియ్యాన్ని సరిహద్దుల గుండా అక్రమంగా తరలించుకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు.

తెలంగాణ–కర్ణాటక సరిహద్దులోని మాడ్గి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్న పోలీసులు

వందశాతం

పన్ను వసూళ్లే లక్ష్యం

జిన్నారం,ఫిబ్రవరి 18:వందశాతం పన్ను వసూళ్లే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమల యజమానులు ముందుకొచ్చి ఆస్తి పన్నులు చెల్లించారు. ఆగ్రోటెక్స్ కోటింగ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ యజమాని బి.రాజు రూ.1,47,751, సంభీమ్ స్పెషాలిటీ యజమాని వై.శ్రీధర్ రూ.2,15,300 వేల ఆస్తి పన్ను చెక్కు రూపంలో కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ప్రారంభానికి ముందే దూకుడుగా మున్సిపాలిటీలో పన్ను వసూళ్లపై మరింత దృష్టి సారించామన్నారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో గడువులోగా వందశాతం లక్ష్యంగా పన్ను వసూళ్లను చేపడుతున్నట్లు వెల్లడించారు. చెల్లింపుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నోటీసులు అందించి, ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. గృహ యజమానులు, పారిశ్రామికవేత్తలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్వో నర్సింహులు, బిల్ కలెక్టర్లు మహబూబ్ అలీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణ పనులు ప్రారంభం

జహీరాబాద్, ఫిబ్రవరి 18: జహీరాబాద్ మండలంలోని చిరాగ్‌పల్లి గ్రామంలో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధిత అధికారులు ముగ్గులు వేశారు. మంగళవారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన పలువురు లబ్ధిదారుల ఖాళీ స్థలాల్లో నిర్మించుకునేందుకు అధికారులు ముగ్గులు వేశారు. ఇండ్ల నిర్మాణానికి మండల అభివృద్ధి అధికారి మహేందర్‌రెడ్డి భూమి పూజ చేసి, పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖాధికారి మాధవరెడ్డి, ఎంపీవో వీరేశం, పంచాయతీ కార్యదర్శి అదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీవో మహేందర్‌రెడ్డి

కలశం బహూకరణ

జిన్నారం, ఫిబ్రవరి 18: మహంకాళి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేకంగా పూజించిన కలశాన్ని మాజీ వార్డు సభ్యురాలు శారదకు అందజేశారు. ఈ మేరకు మంగళవారం మెదక్ జిల్లా జలీల్‌పూర్ మహంకాళి అమ్మవారి ఆలయంలో పూజించిన కళశాన్ని అర్చకుడు స్వయంగా మాజీ వార్డు సభ్యురాలు శారదను ఆమె నివాసంలో కలిసి బహూకరించారు. రాగి కలశాన్ని అందుకున్న ఆమె అర్చకుడిని ఘనంగా సన్మానించి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాన్ని

అడ్డుకున్న అధికారులు

జిన్నారం ఫిబ్రవరి 18: జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది మంగళవారం అడ్డుకున్నారు. నిర్మాణ ప్రదేశంలో సెంట్రింగ్ బాక్సులను స్వాధీనం చేసుకుని ట్రాక్టర్లో కార్యాలయానికి తరలించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

హాజరైన కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ తదితరులు

తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 18: జిల్లాలో ఎక్కడా కూడా తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ మాట్లాడుతూ..వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాను నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. తాగునీటి సరఫరా, యాసంగి పంటకు సాగునీరు డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా, రేషన్ కార్డుల దరఖాస్తుల ధృవీకరణ, రైతు భరోసా పథకాల అమలుపై చర్చించి పలు సూచనలు జారీ చేశారు. జిల్లా నుంచి పాల్గొన్న కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఎద్దడి సమస్యను నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని వివరించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మాధురి, అధికారులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా దళితవాడకు తాగునీళ్లు బంద్

మునిపల్లి, ఫిబ్రవరి 18:మండలంలోని ఖమ్మంపల్లిలో వేసవి రాకముందే తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఆరు నెలలుగా గ్రామంలోని దళితవాడలో తాగునీటి సమస్య ఉందని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోకపోవడంతో మహిళలు మంగళవారం ఖాళీబిందెలతో నిరసనకు దిగారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఇటీవల నిర్వహించిన గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం అధికారుల నిర్లక్ష్యమేననిస్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ కట్....

మండలపరిధిలోని ఖమ్మంపల్లిలో ఆరు నెలల నుంచి తాగునీటి సమస్య ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. దళితవాడకు వచ్చే మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను పంచాయతీ కార్యదర్శి కావాలనే కట్ చేశారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మంపల్లిలో ఏర్పడ్డ తాగునీటి సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కార్యదర్శిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేస్తే కార్యదర్శి స్పందించలేదు.



ఖమ్మంపల్లిలో ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

జహీరాబాద్, ఫిబ్రవరి 18: పంచాయతీలకు సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం, ఆగస్టు నుంచి ఐఎఫ్‌ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపులు ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని న్యాల్‌కల్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం న్యాల్‌కల్ ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజశేఖర్‌ను వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ఫిబ్రవరి 24లో పంచాయతీ పాలక వర్గం కాలపరిమితి ముగిసిందన్నారు. దీంతో ప్రత్యేక పాలనలో భాగంగా పంచాయతీ నిర్వహణ బాధ్యత తమపై పడిందన్నారు. ఆగస్టు నుంచి పంచాయతీ నిర్వహణ కోసం చేసిన ఖర్చులు, బిల్లులకు సంబంధించిన జారీ చేసిన చెక్కులు ఐఎఫ్‌ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉండడంతో తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు వినియోగించే ట్రాక్టర్ డీజిల్, మరమ్మతులు, బ్లీచింగ్ పౌడర్, తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు, వీధి దీపాలు తదితర వాటికి నిధులు లేకపోవడంతో భారంగా మారిందన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయని, వాటి నిర్వహణకు నిధులు లేక అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పంచాయతీల నిర్వహణ కోసం టీఎస్‌బీపీఎస్‌ఎస్ ఖాతాకు నిధులు విడుదల చేసి, పంచాయతీ సాధారణ నిధులను ట్రెజరీకి అనుసంధానం లేకుండా నేరుగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీ నిర్వహణకు నిధులు ఇవ్వకపోతే మార్చి 1 నుంచి నిర్వహణ చేయలేమని తేల్చిచెప్పారు. జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకొని నిధులు మంజూరు చేయాలన్నారు.

ఎంపీడీవో రాజశేఖర్‌ను వినతిపత్రం అందజేసిన పంచాయతీ కార్యదర్శులు

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

జహీరాబాద్, ఫిబ్రవరి 18: బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి అన్నారు. మంగళవారం జహీరాబాద్‌లోని మున్సిపల్ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లకు 18 ఏండ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లదే అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులకు రూ.లక్ష జరిమానా, రెండేండ్ల జైలు శిక్ష పడుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. డీసీపీవో రత్నం, సఖి కోఆర్డినేటర్ కల్పన, డీహెచ్‌సీవో పల్లవి, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అంజమ్మ, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, అనితాకుమారి, సద్గుణ, తులశమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శిశు సంక్షేమ శాఖ అధికారి లలితాకుమారి

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లె సంజీవయ్య

కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు

చౌటకూర్, ఫిబ్రవరి 18:బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును బీఆర్‌ఎస్ సీనియర్ నేత, జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్ పల్లె సంజీవయ్య మంగళవారం కలిశారు. రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి, జడ్పీ మాజీ చైర్మన్ మాసన్నగారి బాలయ్య, ఇతర నాయకులతో కలిసి సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఈ సందర్భంగా కేసీఆర్ పేర్కొన్నారని సంజీవయ్య తెలిపారు. 420 హామీలిచ్చి అధికారం చేపట్టి నేడు చేతులెత్తేసిందన్నారు. ఏడాది వ్యవధిలోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను ప్రజలు అసహించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి, రూ.12 వేలు చెల్లించడం సిగ్గుచేటన్నారు. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుతమేనని, నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో గట్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు.

42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 18:స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్ట బద్ధత కల్పించాలని ఓబీసీ ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డిలో ఆయన మాట్లాడూతూ రానున్న పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్, నగర పాలక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42శాతం పెంచడంతోపాటు తమిళనాడు తరహాలో చట్టబద్ధత కల్పించాలన్నారు. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో పొందుపరిస్తేనే రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులతో ప్రధానమంత్రిని కలిసి ఒప్పించాలని, పార్లమెంట్‌లో తీర్మానం ద్వారానే చట్టబద్ధత సాధ్యమవుతుందన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ఆర్టికల్ 9 ప్రకారం చట్టబద్ధత కల్పించాలన్నారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జగదీశ్, బీసీ యువత సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరుగంటి రమేశ్ కుమార్, నాయకులు నిఖిల్, కార్తీక్. కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తాటిపల్లి పాండు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మునిపల్లి, ఫిబ్రవరి 18: క్రీడలతో కొత్త పరిచయాలు ఏర్పడతాయని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం చీలపల్లిలో న్యాలకంటి పరమ్మయ్య పటేల్ జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి చైర్మన్ హాజరై క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. క్రీడలతో గుర్తింపుతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా వస్తాయన్నారు. టోర్నమెంట్‌ను స్నేహపూర్వకంగా నిర్వహించాలని సూచించారు. టోర్నమెంట్‌లో 40 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన అతిథులను టోర్నమెంట్ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు.

ఆలయ వార్షికోత్సవం

సదాశివపేట, ఫిబ్రవరి 18: పట్టణంలోని బంగారు మైసమ్మ ఆలయ 16వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనయుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్ కలశాల ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. పురవీధుల గుండా మహిళలు కలశాల ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, అడ్లగట్ట మనోహర్, మేకల జనార్దన్, విశ్వనాథం, ఎన్నం మల్లేశం, కోట రవీందర్, శంకర్, వెంకటేశం, వీరేశం నర్సింహులు పాల్గొన్నారు.

చక్రియాల ఆలయ పూజారిని తొలగించాలి

చౌటకూర్, ఫిబ్రవరి 18: మండలంలోని చక్రియాలలో వెలసిన లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి ఆలయ పూజారిని తొలగించాలని కోరుతూ గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. మంగళవారం ఆలయ మండపంలో సమావేశమై పూజారి ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. ప్రతిరోజూ స్వామివారికి ధూప, దీప నైవేద్యం, ఆరాధన చేయాల్సిన పూజారి చుట్టపుచూపుగా ఆలయానికి వస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామస్తుల సంతకాలతో కూడిన ప్రతులతో సంగారెడ్డిలోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. స్వామివారికి నిత్య పూజలు చేయని, ఈ పూజారి తమకు ఎంత మాత్రం వద్దంటూ ప్రజలంతా ముక్తకంఠంతో ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంత పద్మనాభ స్వామికి చెందిన 8 ఎకరాల భూమిని అనుభవిస్తున్నారని, అయినా స్వామి వారికి పూజలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఏ మాత్రం అందుబాటులో ఉండకుండా ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారని మండిపడ్డారు. దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ప్రజలకు అందుబాటులో లేని పూజారిని తొలగించి, కొత్త పూజారిని నియమించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఆలయ కమిటీ చైర్మన్ భానూరి లక్ష్మయ్య, మాజీ చైర్మన్లు మహిపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, రోళ్లపాటి పండరి, డైరెక్టర్లు రోళ్లపాటి సత్యనారాయణ, అంజిరెడ్డి, మన్నె నర్సింహులు, గ్రామ పెద్దలు చిన్నరోళ్ల పాటి రాజశేఖర్, మల్లారెడ్డి తదితతరులున్నారు.

లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో సమావేశమైన గ్రామస్తులు



ఆలయంలో శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

జహీరాబాద్, ఫిబ్రవరి 18: జహీరాబాద్ పట్టణంలోని మహీంద్రా కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని కనులపండువుగా నిర్వహించారు. మంగళవారం స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా శ్రీదేవి, భూదేవిలతో వేంకటేశ్వర స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం మహిళలు స్వామివారితోపాటు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు ఒడిబియ్యాన్ని కట్నకానుకలను సమర్పించి దర్శించుకున్నారు. కార్యక్రమంలో పట్టణంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, పలు వార్డులకు చెందిన భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అభివృద్ధి చెందాలి

కోహీర్, ఫిబ్రవరి18: జిల్లా సహకార బ్యాంకు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార కేంద్రం ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను రైతులందరూ వినియోగించుకోవాలని పీచెర్యాగడి పీఏసీఎస్ చైర్మన్ స్రవంతిరెడ్డి, కోహీర్ డీసీసీబీ మేనేజర్ శివకుమార్ కోరారు. మంగళవారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో డీసీసీబీ, పీఏసీఎస్ సొసైటీ అందిస్తున్న సేవలపై రైతులకు అవగాహన కల్పించారు. పథకాలను వినియోగించుకొని రైతులందరూ అభివృద్ధి చెందాలని వారు సూచించారు. సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, కార్యదర్శి ప్రశాంత్, బీఆర్‌ఎస్ నాయకుడు నర్సింహులు తదితరులు ఉన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న పీఏసీఎస్ చైర్మన్, బ్యాంకు మేనేజర్